# ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు..!

- మండల కేంద్రంలో సెంటర్ లేక ప్రజల ఇబ్బందులు

పెద్దవంగర: ప్రతి అవసరానికి ప్రస్తుతం ఆధార్ తప్పని సరి అయ్యింది. రేషన్ ఈకేవైసీ, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లకి ఈ–కేవైసీకీ ఆధార్ కార్డులను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. పిల్లలను బడిలో చేర్పించాలన్నా, సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతా, విద్యార్థుల ఉపకారవేతనాలు అన్నింటికీ ఆధార్ అడుగుతున్నారు. అయితే ఆధార్ నమోదుకు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

పెద్దవంగర మండలం 10,576.17 చ.కి.మీటర్ల విస్తీర్ణంలో 20 గ్రామ పంచాయతీలతో ఏర్పాటు చేశారు. వాటి పరిధిలోని అనుసంధాన గ్రామాలుగా మరో 10 తండాలు ఉన్నాయి. ఇందులో 6,855 కుటుంబాలకు గాను 27,823 మంది జనాభా కలదు. పురుషులు 13,971, మహిళలు 13,852 ఉన్నారు. 2016 అక్టోబర్ 11న నూతన మండలంగా ఏర్పాటు చేశారు. పదేళ్ల గడువు ముగిసిన ఆధార్ కార్డులన్నింటిని తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. కాగా మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక పోవడంతో పాత మండలాలైన తొర్రూరు, కొడకండ్ల దూర ప్రాంతాల్లో ఉన్న ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.


పెద్దవంగరలో తహసీల్దార్ కార్యాలయం

**ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి**



ఆధార్ నమోదు, తప్పొప్పుల సవరణలు వంటి సేవలు ప్రతి ఒక్కరికీ అవసరమవుతున్నాయి. అలాగే ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన వారు అప్‌డేట్ చేసుకోవాలని చెబుతున్నారు. కాబట్టి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

– ఈదురు సత్యనారాయణ, సాత్విక ఫౌండేషన్ అధ్యక్షుడు

## క్లుప్తంగా

### ఎంపీ టికెట్ కేటాయించాలి



గార్ల: ఎరుకల కులస్తుడైన తనకు మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను కేటాయించాలని ఏకలవ్య సంఘం రాష్ట్ర నాయకుడు రాయపురం సాంబయ్య టీపీసీసీ రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు మొగిలి వెంకన్న, నాగేందర్, నాగేశ్వరరావు, సురేష్, కొమ్రాజు పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

నెల్లికుదురు: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించినట్లు జిల్లా కబడ్డీ అసోయేషన్ కార్యదర్శి తోట నరేష్, అధ్యక్షుడు పిడుగు మురళీ తెలిపారు. సుమారుగా 400 వందల మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు.

### ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలి

నెహ్రూసెంటర్: ఈనెల 15వ తేదీన అన్ని తండాల్లో భోగ్‌బండారో, సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్‌నాయక్ పిలుపునిచ్చారు. సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు భూక్య స్రవంతి, బానోత్ పూజబాయి, బానోత్ నరేందర్‌నాయక్, గుగులోత్ మాలునాయక్ పాల్గొన్నారు.

### ఏజెన్సీ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్ అర్బన్: ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులకు, ఉద్యోగుల అడిషనల్ హౌస్‌రెంట్ అలవెన్స్‌ల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ అధ్యాపకుల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు వి.రవీందర్, కార్యవర్గ సభ్యుడు జి.సోమన్న ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని లాల్‌బహదూర్ పాఠశాలకు చెందిన 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం భూపతి విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు శంకర్, రహీం, సంగీత, భారతి, రమణను ఘనంగా సన్మానించారు.

### సమ్మెను జయప్రదం చేయండి



దంతాలపల్లి: మండలకేంద్రం భారత రైతు కూలీ సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగయ్య ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలు, వైఫల్యాలపై ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకన్న, తొట్టి హరీశ్, భిక్షపతి, ధర్మారపు సందీప్, కారపాటి వెంకన్న పాల్గొన్నారు.

### పొదుపుతో భవిష్యత్‌కు భరోసా

నర్సింపేట రూరల్ : డబ్బు పొదుపు చేసుకుంటే భవిష్యత్‌కు భరోసా ఉంటుందని ప్రతిభ పురుషుల పొదుపు పరస్పర సహకార పరిమిత సంఘం అధ్యక్షుడు బీరెల్లి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సర్వాపురంలో ఆ సంఘం 30వ వార్షిక మహాసభను ఆదివారం నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడిగా బీరెల్లి సుధాకర్‌రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా గంట చందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నేటినుంచి దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఏ క్యాబిన్ రోడ్డులో గల నాగేంద్రస్వామి దేవాలయ ఆవరణలో శ్రీలలితాదేవి, శివలింగ నంది, మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని శ్రీనాగేంద్రస్వామి దేవాలయ కమిటీ బాధ్యులు ఆదివారం తెలిపారు. మూడు రోజులపాటు జరుగనున్న పూజల్లో భాగంగా మొదటి రోజు ఉదయం 8.30గంటలకు గోపూజ, గణాధిపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభించి 11గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. 13వ తేదీ మంగళవారం ఉదయం 5గంటలకు సుప్రభాతంతో పూజలు ప్రారంభమై 10గంటలకు 1,108 బిందెలతో దేవతామూర్తులకు జలాభిషేకం, చండీహోమం, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన పూజలు, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. 14వ తేదీ బుధవారం ఉదయం 5 గంటలకు దేవతామూర్తి పూజలతో మొదలై శ్రీలలితాదేవి, శివలింగ నంది, మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని వివరించారు.


వేడుకలకు సిద్ధమైన శ్రీనాగేంద్రస్వామి ఆలయం

# బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పెద్దబోయిన వీరబాబు ఆరోపించాడు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన ఆనవాయితీనే ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. విద్యారంగానికి 7.8 శాతం అంటే రూ.21,389 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. గత ప్రభుత్వ బడ్జెట్‌తో పోలిస్తే రూ. 2,296 కోట్లు విద్యారంగానికి పెరిగినట్లు ఉన్న మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే పెరిగింది చాలా తక్కువ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్షయ, అనురాధ, సంధ్యా, శ్రావణి, స్వాతి, ప్రియాంక, మమత, తరుణ్, రవిచరణ్, సుమన్, కిరణ్,నరేష్, సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీరబాబు

### కేంద్రం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

గూడూరు: కేంద్ర ప్రభుత్వ రైతాంగ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ)జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రైతాంగాన్ని దివాల చేస్తూ, కార్పొరేట్ సంస్థల కొమ్ము కాస్తుందన్నారు. ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు బండెల వీరస్వామి, కటకం బుచ్చిరాములు, సత్తయ్య పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై కళా ప్రదర్శన

డోర్నకల్: హెచ్ఐవీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన అవసరమని కోరుతూ గొల్లచర్ల గ్రామంలో ఆదివారం కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాబృందం ప్రతినిధి పోలెపాక రమేష్‌బాబు, నక్క శిరీష, విజయ పాల్గొన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తొర్రూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన సంఘటన ఆదివారం మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని ఆయా గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై జగదీష్ వివరణ కోరగా మండలానికి చెందిన ట్రాక్టర్ల యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించామని, తరుచూ వస్తున్న మౌఖిక ఫిర్యాదులపై నిఘా పెట్టామని తెలిపారు.

### సన్మానం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండాలో ఆదివారం తండా పెద్దగా నియమితులైన భూక్యా లక్ష్మణ్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, మాజీ సర్పంచ్ బానోత్ పాండు నాయక్ పాల్గొన్నారు.

# కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజు

నెహ్రూసెంటర్: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 146 మున్సిపాలిటీల్లో 60వేల మంది కార్మికులు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారని, కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, కాంపల్లి శ్రీనివాస్, కాగితం శ్రీనివాస్, పార్నంది కృష్ణ, ఎల్లయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆశకార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి**

ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశకార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘ కార్యాలయంలో యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్‌గా వడ్లకొండ ఉపేంద్రను ఎన్నుకున్నారు. ఈనెల 16వ తేదీన జరగనున్న సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆసియా, రమ, జ్యోతి, కవిత, స్వరూప, శకుంతల, కౌసల్య, శారద, లత, రమాదేవి పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న హనుమాండ్ల ఝాన్సీ

పెద్దవంగర: కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఝాన్సీరెడ్డి పాల్గొని మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దవంగర మండల నుంచి సుమారు ఐదు వేల మెజార్టీ ఇచ్చారని, అదే ఒరవడిన కొనసాగిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు అనే మాట వినపడద్దని, అలా చేస్తే ఎవ్వరైన ఉపేక్షించేది లేదన్నారు. సేవ చేసే అదృష్టం అందరికి రాదని, నాయకులు ప్రజలకు సేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు జాటోతు నెహ్రూనాయక్, మాజీ ఎంపీపీ వెంకన్న, మురళీ, శ్యాం, సీతారాం నాయక్, కరుణాకర్, వేణు, సతీష్, పాడిశెట్టి సైదులు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కనుచూపు మేర తాటివనం..



కనుచూపు మేర తాటివనంతో ఉన్న ఈ దృశ్యం కల్లుప్రియులను, చూపరుల దృష్టిని ఆకర్షిస్తోంది. మండలంలోని పెత్తాళ్లగడ్డ(వెంకట్రాంపురం)–బయ్యారం రహదారి మధ్యలో ఉన్న తాటివనం కనుచూపు మేర కనిపిస్తోంది. ఈ దృశ్యాన్ని ఆదివారం సాక్షి క్లిక్ అనిపించింది.

– బయ్యారం

# వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


మహబూబాబాద్ రూరల్: పూజల్లో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వాసవీ మాత దేవాలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు తాటిపాముల దుర్గాప్రసాద్ ప్రత్యేకంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి, అర్చన పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ కార్యదర్శి ఇమ్మడి రవికుమార్ పాల్గొన్నారు.

గార్ల: ఆర్యవైశ్యుల కుల దేవత అయిన కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణం సందర్భంగా ఆర్యవైశ్యులు వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆదివారం గార్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేమిశెట్టి శ్రీనివాస్ కవిత దంపతులు, సాయి శ్రావణి, మణికంఠ, సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట : లక్కమారి రెడ్డి సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర మల్లారెడ్డి, నాయకులు నూనె మల్లారెడ్డి, గాదె మోహన్‌రెడ్డి, గోనె సంతోశ్‌రెడ్డి, కడుదూరి సంపత్‌రెడ్డి, పెంతల శ్రీకాంత్ రెడ్డి, పెంతల నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జీపీ కార్మికులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మున్సిపల్ కార్మికులకు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వంద మందికి ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి శంబయ్య, కోశాధికారి సదానందం, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు**



బయ్యారం: మండలంలోని సత్యనారాయణపురంలో ఈనెల 14న నిర్వహించనున్న రామాలయ పునఃప్రతిష్ఠకు సంబంధించిన పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భద్రాద్రి రామాలయానికి చెందిన పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనము, మృత్యంగ్రహణం, అంకురారోహణ పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను పురస్కరించుకొని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

**నిత్యావసరాల పంపిణీ**

దంతాలపల్లి: మండలకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 10మంది గ్రామపంచాయతీ కార్మికులను సన్మానించి, వారికి నిత్యావసరాలను కాంగ్రెస్ పార్టీ నాయకుడు సేను రాజేష్ ఆదివారం అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు మార్త శ్రీనువాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**మూగ యువతితో ఆదర్శ వివాహం**

నర్సింహులపేట: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో ఆదివారం మూగ యువతిలో కులాంతర ఆదర్శ వివాహం జరిగింది. నర్సింహులపేట గ్రామానికి చెందిన వేముల శిరీష (మూగ), కొమ్ములవంచ గ్రామానికి చెందిన కందునూరి కోటేష్ ఇద్దరు ఇష్టపడంతో పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరు మేజర్స్ కావడంతో ఆలయ ప్రాంగణంలో ఆదర్శ వివాహం జరిపించారు. కార్యక్రమంలో ఎస్సై గండ్రాతి సతీష్, గ్రామస్తులు గుద్దేటి శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**జయప్రదం చేయండి**

గార్ల: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సక్రు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీలో ప్రచారం నిర్వహించారు.

**కార్యకర్తలకు అండగా ఉంటా..**



పెద్దవంగర: కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, ఎవరూ అధైర్య పడొద్దని అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఇటీవల గుండె సంబంధిత స్టంట్ చికిత్స పొందాడు. కాగా గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న అతన్ని దయాకర్‌రావు కలిసి యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య శర్మ, సుధీర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఆలయ నిర్మాణానికి భూమిపూజ**



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం గ్రామంలో గంగమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి పురోహితులు గుండోజు నాగార్జునాచార్యులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. యాదవ సంఘం, భక్తుల సహకారంతో ఆలయం నిర్మిస్తున్నారు.

**బాధిత కుటుంబానికి ఆర్థికసాయం**



గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు జన్ను రాజు ఇటీవల మృతిచెందాడు. ఆయన మృతిని తెల్సుకున్న గ్రామానికి చెందిన ఏపూరి సుభాష్‌రెడ్డి ఆదివారం రూ.10,216 ఆర్థికసాయం అందించాడు. అదే విధంగా బీఆర్ఎస్ మండల కార్యకర్తలు బియ్యం అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న, బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధు గౌడ్, వాంకుడోతు కొమ్మాలుతో పాటు పలువురు యూత్ కార్యకర్తలు ఖర్చుల నిమిత్తం రూ.60వేల ఆర్థికసాయం అందించారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్యకర్తలు, నాయకులు

మరిపెడ రూరల్: గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ఐచ్ఛిక సెలవు ప్రకటించినందుకు మండల కేంద్రంలో సీఎం రేవంత్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో వచ్చే సేవాలాల్ మహారాజ్ జయంతి నాటికి విగ్రహా ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. దేశంలో 10కోట్ల మంది జనాభా కలిగిన లంబాడీలు మాట్లాడే గోర్ బోలే భాషను ఎనిమిదోవ షెడ్యూల్ చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని, త్వరలో తండాలు గూడాలకు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పడం గొప్పవిషయమన్నారు. సీం రేవంత్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌కు మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తేజావత్ నెహ్రూనాయక్, తాజ్ద్దీన్, బోర గంగయ్య, అప్సర్‌పాషా, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, రవికాంత్, బుర్ర నవీన్ యాదవ్, అజ్మీర శ్రీను, విజయ్, నరేష్, మహేష్, సురేష్, పాపులాల్, రవీందర్, వీరన్న, బానోతు వెంకన్న, జితేందర్, గణేష్‌నాయక్, దస్రునాయక్, ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

# తపాలా ఉద్యోగులకు క్రికెట్ పోటీలు



మహబూబాబాద్ అర్బన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మహబూబాబాద్ హెడ్ పోస్ట్ మాస్టర్ పెండ్రా రాంచందర్, సబ్ పోస్టుమాస్టర్ కోట సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 140 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తపాలా ఉద్యోగులకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు వాసం అనిల్, తోట సురేష్, కోట సతీష్, భరత్, యాకూబ్, సుధాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.